# స్పందన

## సి.హెచ్. శాంతాదేవి.

రైలు దిగిన వందిత జనాన్ని తప్పించుకుని ఒక పక్కగా నిలబడింది. ఆమె కళ్ళు వచ్చేపోయే మనుష్యుల్ని శీలనగా గమనిస్తున్నాయ్. తన లెటర్ అందిందో లేదో! ఏ కారణం వల్లనైనా స్టేషన్‌కి రావటానికి వీల్లేకపోతే ఏం చెయ్యాలి? అతను ఎలాగూ వస్తాడు కదాని అడ్రస్ కాగితం తీసుకురాలేదు. ఈ సిటీలో ఎక్కడని వెతకటం? ఆఫీసుకు వెళదామన్నా ఈరోజు ఆదివారం అయిపోయింది.

రైలు కూత కూసి బయల్దేరింది.

జనం పల్చబడ్డారు. సూట్‌కేస్ చేత పట్టుకుని ఒంటరిగా నిలబడ్డ వందిత వేపు ఒకరిద్దరు ఓరగా చూసుకుంటూ వెళ్లారు.

వందిత పట్టించుకోలేదు. ఆమె ఆతృతగా చూస్తోంది.

సరిగ్గా అదే సమయంలో దూరం నుండి వగర్చుకుంటూ పరుగులాంటి నడకతో మోహన్ కనిపించాడు.

అతను కనిపించిన సంతోషంలో వందిత చుట్టూ పరిసరాలు మర్చిపోయి అతనికి ఎదురు వెళ్ళింది.

"హలో వందితా, ప్రయాణం సుఖంగా జరిగిందా?"

వందిత రెండడుగులు వెనక్కి వేసింది. ఒక్క క్షణం మోహన్ వేపు పరిశీలనగా చూసింది.

"ఏమిటలా నిలబడ్డావ్? పద. బయట టాక్సీ వెయిట్ చేస్తోంది..." ఆమె చేతిలో సూట్‌కేస్ తానందుకున్నాడు.

"టాక్సీనా?... టాక్సీ ఎందుకు మోహన్? నడుచుకుంటూ వెడితే పది నిమిషాల్లో ఇల్లు చేరమూ?" నొచ్చుకున్నట్టుగా అంది.

"అమ్మో! నిన్ను నడిపిస్తానా? గెజిటెడ్ ఆఫీసరుగారి భార్యవు" చిలిపిగా నవ్వుతూ చూశాడు.

'గెజిటెడ్ ఆఫీసరు భార్యనే అయినా చిన్ననాటి నీ స్నేహితురాల్నిగా మోహన్...' అనుకుంది.

టాక్సీలో నుండి బయటకు చూడ సాగింది. ఊరు చాలా మారింది. పూర్వం తనూ, మోహన్ ఈ రోడ్డు మీదే సరదాగా కబుర్లు చెప్పుకుంటూ నడిచేవారు.

మోహన్ లెటర్ రాస్తూ తనను మళ్ళీ అమలాపురం బ్రాంచీకి వేసినట్టూ సాధ్యమైనంత త్వరలో వెళ్ళిపోతున్నానని రాస్తూ, వీలైతే ఒకసారి వచ్చివెళ్ళమనీ, పాతజ్ఞాపకాలు నెమరువేసుకుందామనీ ఎంతో యిదిగా రాస్తే సరదాగా గడపవచ్చని బయల్దేరింది.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్? మీనాన్నగారు ఈ ఊరునుంచి బదిలీ అయ్యాక మళ్ళీ యిటువేపు రాలేదనుకుంటా. నేనూ అంతేననుకో; అయితే ఆఫీస్ పనిమీద వచ్చి రెండురోజులు వున్నాను గానీ బిజీగా గడిచిపోయింది...ఇక్కడున్న రెండురోజులూ నువ్వే గుర్తుకువచ్చావు వందితా..." బయటకు చూస్తూ అన్నాడు

వందిత మాట్లాడలేదు.

"నువ్వు మారలేదు వందితా, సరిగా పదిహేనేళ్ళ క్రితం ఎలా వున్నావో ఇప్పుడూ అలానే వున్నావు..." మోహన్ వందితవేపు నవ్వుతూ చూశాడు.

"........."

"మీ ఆవిడ ఊళ్ళోనే వుందా అంటూ ప్రత్యేకంగా రాశావు. ఏమిటి విశేషం? పరిచయం చేసుకోవాలని చాలా కుతూహలంగా వున్నట్టుందే..."

వందిత జవాబు చెప్పలేదు.

ఆమెకసలు ఏం మాట్లాడాలో తోచకుండా వున్నది. మోహన్ సరదాగానే వున్నాడు ఆ సరదా చిన్ననాటి స్నేహితురాల్ని కలుసుకున్నాననే సంబరం మాత్రమే; అతని నుండి యింకా ఏదో ఆశించిన వందిత కళ్ళలో ఆరాటంగం స్పష్టంగా వ్యక్తమవుతూంది.ఆమె కేదో సంకోచంగా వుంది. అతనికి, తనకీ మధ్య తెలియని దూరం...టాక్సీ ఆగింది...

"దిగు. ఇల్లు వచ్చేసింది..." మోహన్ వందితవేపు డోర్ తీసినట్టు కున్నాడు.

వందిత నెమ్మదిగా లోపలికి నడిచింది.

మోహన్ లోపలకి ఒక్క కేక పెట్టాడు

"ఏయ్ భవానీ...ఇలా రా ఎవరొచ్చారో చూడు..."

వందిత అక్కడున్న సోఫాలో కూర్చుంది మౌనంగా. అతని ప్రతిచేష్టా ఆమెలో దిగులు అధికం చేస్తోంది.

ఇల్లు చాలా నీట్‌గా సర్ది వుంది.

ఇల్లాలు కూడా అంత నీట్‌గానూ వుండివుండాలి.

కానీ లోపల్నుండి బయటకు వచ్చిన మోహన్ భార్యవేపు ఇబ్బందిగా చూసింది.



మోహన్ ఈ మనిషిని ఎలా భరిస్తున్నాడన్న ఆశ్చర్యాన్ని పైకి కనబడనీయకుండా పైకి వినయంగా.

"నమస్కారమండీ..." అంది.

భవానీ తను కూడా నమస్కారం చేస్తూ వందితవేపు విశితంగా చూడసాగింది.

వందితకు ఏం మాట్లాడాలో తోచటం లేదు. కొంతమందిని చూస్తే ఎందుకో తెలీదుగానీ మొదటిచూపులోనే అయిష్టత కలుగుతుంది. కారణం తెలీదు. ఒక్కొక్క మొహం తీరు మనల్ని అలా ఆకట్టేసుకుంటుంది. భవానీ వందితకు ఏమాత్రం నచ్చలేదు... మోహన్ భార్యగా అసలు నచ్చలేదు.

భవానీ చీరెకుచ్చెళ్ళు పైకి కట్టుకుంది. జుట్టు ఎన్నాళ్ళో అయి దువ్వకున్నట్టు దుబ్బుగా వుంది. మొహాన పెద్ద కుంకుమబొట్టు...వయసులో చాలా చిన్నదే అయినా ఆమె అలంకరణ పెద్దవాళ్ళని జ్ఞప్తికి తెస్తోంది. మోహన్ ఇదేమీ పట్టించుకోనట్టు భార్యని ఆరాధనా దృష్టితో చూస్తూ ఉత్సాహంగా చెప్పుకుపోతున్నాడు.

"భవానీ నీకు చెప్తూంటానే...వందిత చిన్నప్పట్నుంచీ ఇద్దరం స్నేహితులం. వందితకు పెళ్ళయి చాలా దూరం వెళ్ళిపోయింది. ఇప్పుడు ఆమె భర్త పెద్ద ఆఫీసరు. బొంబేలో పెద్ద బంగళా కట్టించాడు ఈ మధ్యనే.... అన్నట్టు వందితా కారు కొన్నాడా మీ ఆయన..."

వందిత మొహం చిట్లించుకుంది.

మోహన్ మాట్లాడే ఆ తీరు భార్యకి తనను పరిచయంచేసే ఆ పద్ధతి

ఏమాత్రం నచ్చని వందిత ఏం మాట్లాడ-లేదు

భవానీ భర్త మాటలన్నిటికీ "అహా, అలాగా...అవ్వా" అంటూ రకరకాలుగా హావభావాలు ప్రదర్శిస్తోంది.

"కాఫీ తీసుకురా...వందితా, కాఫీ తాగుతావా, బోర్నవీటానా?"

మోహన్ చేసే అతిమర్యాదలు వందితకు ఎబ్బెట్టుగా వున్నాయి.

మోహన్ ఎందుకిలా తనని పరాయి దానిలా చూస్తున్నాడు. అతనికి ఆఫీసర్ భార్యగా తప్పితే చిన్ననాటి వందితగా తను జ్ఞాపకం లేదా?

"ఇప్పుడేం వద్దు మోహన్...రాత్రి అంతా నిద్రలేదు. పడుకుంటాను..."

వందితకు కాసేపు ఒంటరిగా వుండాలనిపించింది.

"అలాగే! భవానీ, వందితకు రూమ్ చూపించు..." వందిత బట్టలు మార్చుకుని మంచంమీద వాలబోతుండగా, మోహన్ వచ్చాడు.

"వందితా, ఏర్పాట్లన్నీ బాగున్నాయా? నువ్వు వస్తున్నావని తెలిసినప్పట్నుంచీ భవానీని వూపిరాడనివ్వలేదనుకో...బాంబేలో వుండి వచ్చిన దానివి. మేము పల్లెటూరివాళ్ళం..."

అతను వ్యంగ్యంగా అంటున్నాడా అని అనుమానంగా చూసింది. మోహన్‌ను గురించి అలా భావించినందుకు మనసులోనే సిగ్గుపడింది. మోహన్ స్వభావం తనకు తెలుసు. ఏదైనా అతిగానే చేస్తాడు. ఒక్క పదినిమిషాలు మోహన్‌తో ఒంటరిగా మాట్లాడాలనుంది అసలా అవకాశం కోసమే ఎదురు చూడటంలేదు అతను. ఎంతసేపూ భార్య నామస్మరణంతోనే తృప్తి పడుతున్నాడు. భార్యని ప్రేమించటంలో తప్పులేదు... కానీ దాదాపు పదేళ్ళు ఒక్కటిగా కలిసి గడిపిన స్నేహితురాలిపట్ల నిర్లక్ష్యం కలిగిస్తుందా ఈ "'పెళ్ళి' అనే సంఘటన...మోహన్‌ని ఎన్నో అడగాలనుంది. ఎన్ని సంవత్సరాలయింది కలుసుకుని. మోహన్ ఆ ధ్యాసే లేనట్టు ఒక వారం క్రితం వందితను కలుసుకుని మళ్ళీ ఇప్పుడు కలిసినట్టుగా వుంది. అతని మాటల ధోరణి. తామిద్దరూ కలుసుకుని పదిపన్నెండు సంవత్సరాలవుతోందని గానీ, కనీసం పదిహేనేళ్ళు ఒకరినొకరు అంటిపెట్టుకుతిరిగామనిగానీ అతనికి జ్ఞాపకం వున్నట్టే లేదు. ఎవరో చుట్టం ఇంటికి వచ్చినట్టుగా అతను ఎంతో మామూలుగా మర్యాదలు చేస్తున్నాడు. ఎటువంటి పరిస్థితిలో తాము విడిపోయారో, అతనికి గుర్తులేదు. ఆ విడిపోవటం, విడిపోవటం తిరిగి ఇన్నాళ్ళకి కలుసుకున్నామన్న ఆత్రుత అతనిలో కనిపించటం లేదు...

వందిత మనసు భారంగా తయారయింది. ఎన్ని ఊహించుకుని వచ్చింది తను. చిన్ననాటి ఆత్మీయతను పంచి

యిస్తాడనుకుంది. ఆనాటి సంఘటనలు నెమరువేసుకుంటూ కొద్ది రోజులైనా గతంలో జీవించాలనుకుని ఆశతో వచ్చింది. మోహన్‌లో తెలియని మార్పు తనని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

నిద్రపట్టక మంచంమీద దొర్లింది. నిజానికి నిద్రపోవాలని వచ్చిందా ఇక్కడికి అంతదూరం నుంచి.

ఒకగంట నిద్రపోయి లేచేసరికి వంటింట్లో మంది నవ్వులు వినబడుతున్నాయి.

"కొత్త ఆ డబ్బా ఇలా అందుకుంటారూ?" భవానీకంఠం వినబడుతూంది

వందిత లేచి వంటింటి గుమ్మంలో నిలబడింది.

భవానీ చీరెకుచ్చెళ్ళు పైకి ఎగదోపుకుని ఏదో టిఫిన్ కార్యక్రమంలో ఉంది. పొద్దున్న వంటచేసి వున్న ఆ బిడ్డ మొహంతోనే వుంది. మోహన్ భార్యతో ఏదో జోకులేస్తూ పనిలో సాయపడుతున్నాడు

ఈ మోహన్ తనకి పూర్తిగా అపరిచితుడు తనకి తెలిసిన మోహన్ వేరు. అతని అలవాట్లు, పద్ధతులు వేరు ఈ మోహన్ అతి సామాన్యంగా అందరి భర్తలవలె ప్రవర్తిస్తున్నాడు.

వందిత అక్కడ నిలబడలేక వెనక్కి తిరిగి వచ్చేసింది. హాల్లో సోఫాలో కూర్చుంది. ఆమె కేదో దిగులుగా వుంది. ఏదైనా మనం ఊహించిన దానికి విరుద్ధంగా జరిగితే మనసులో తల్లడిల్లుతాం. ఒక వ్యక్తిని ఎంతో గొప్పవాడిగా భావించి, మనసులో ఆరాధించి ఎవరికీ అందనంత ఎత్తులో ఊహించుకుని తీరా ఆ మనిషి సమీపానికి వచ్చేసరికి అంత ఉన్నతమయిన వ్యక్తి ఎంత సామాన్యుడో, మన ఊహలన్నీ ఎంత తల్లక్రిందులైనాయో తెలుసుకున్నప్పుడు భరించరాని వేదనగా వుంటుంది.

మోహన్ విషయంలో అలాగే జరిగింది అతను చాలామంది సాధారణమయిన మగవాళ్ళకన్నా అతీతుడనుకుంది. అతనితో స్నేహం చేసిన రోజులన్నీ తనకి ప్రపంచం మహాసుందరంగానూ ఎంతో గొప్ప వ్యక్తి తనకి మాత్రమే దగ్గరైనాడనే గర్వంగానూ వుండేది.

"అరే, నువ్వు లేచావేమిటి? భవానీ, వందిత లేచింది. కాఫీ, టిఫిన్ పట్రా" బిగ్గరగా అరుస్తున్నాడు.

అతనలా అరుస్తుంటే వందితకేదో బాధగానూ వుంది ఏదో చెప్పాలని ఆరాటంగానూ వుంది.

సున్నితంగా, మృదువుగా గొంతెత్తి పాడే మోహన్ తెలుసుగానీ, కొత్తగా ఇంత అనాగరికంగా, సంస్కారం మరిచిపోయి ప్రవర్తించే ఈ మోహన్ తనకి కొత్తవాడు.

"వందితా, భవానీ వుంది చూశావా,

ఈ గులాబ్‌జాం ఎంత బాగా చేస్తుందో అసలు స్వీట్సు తయారుచేయటంలో తన అందెవేసిన చెయ్యి..." మోహన్ ఏదేదో చెబుతున్నాడు. వందిత మౌనంగా వింటోంది.

భవానీ మురిగ్గావున్న చేతులు చీరె కుచ్చెళ్ళకి రాసుకుంటుంటే వందిత కంపరంగా చూసింది.

"భవానీ! ఈరోజు వంటలు వందిత ఇష్టప్రకారం చెయ్యాలి. నీ కేదిష్టమో చెప్పు వందితా. నేను చెప్పి చేయిస్తాను. నువ్వేం మొహమాటపడకు. ఇది నీ ఇల్లే అనుకో..."

"భవానీ కాసేపు కూచుని లోపలకు వెళ్ళిపోయింది. ఇంతసేపటికి వందిత ఎలాగో నోరు పెగల్చుకుని అడిగింది.

"నువ్వింకా పాడుతున్నావా మోహన్ నీ రికార్డుల క్యాసెట్లు నా దగ్గర భద్రంగా వున్నాయ్. అప్పుడప్పుడు రాత్రిపూట అవి పెట్టుకు వింటుంటే గడచిన రోజులన్నీ జ్ఞప్తికి వస్తుంటయ్..." అతన్ని ఎలాగైనా...ఒక్క క్షణం...

ఒక్క క్షణం...

గతంలోకి తొంగిచూసేలా చెయ్యాలని ఆమె తాపత్రయం...మోహన్ కిలిగ్గా నవ్వాడు

"ఏనాటో వందితా, ఆ పాటలన్నీ ఏనాడో మర్చిపోయాను. నీ దగ్గర క్యాసెట్లు వున్నాయంటున్నావా? మా యింట్లో మా ఆవిడ అశ్రద్ధతో ఆ టేపులు తెగిపోయి, కేసులు విరిగిపోయి ప్రస్తుతం మా స్టోర్‌రూంలో పాతసామాన్ల పెట్టెలో పడవేసి వున్నాయ్. అఁ- ఎందుకొచ్చిన పాటలు? అన్నట్టు భవానీ పేరస్థలం కొన్నాను- ఇంకా రిజిస్టర్ కాలేదనుకో. మంచి ప్లాన్ ఆలోచించి చెప్పు చాలా ఆధునాతనంగా కట్టిందా అని భవానీ వుద్దేశం-" వందిత మొహం దించుకుని కూచుంది.

పాటలే నా వూపిరి, గానమే నా ప్రాణం అని కలవరించే మోహనేనా యిలా మాట్లాడింది! అతనిలో ఎక్కడో సున్నితమైన భావకవాటాలు మూసుకుపోయినై. అతను ప్రస్తుతం తను గడిపేది జీవితం అని నమ్మే స్థితిలో వున్నాడు. ఒకప్పుడు యింతకన్నా వున్నతమైన, వుదాత్తమైన లోకాన్ని తాను సృష్టించాననీ గానీ, అందులో జీవించానని గానీ మర్చిపోవటానికి ప్రయత్నిస్తున్నాడు.

"ఎందుకు జరిగిందిలా?

"సాయంత్రం సినిమాకి వెడదామంటోంది భవానీ ఈ మధ్య సినిమాలు చూడటం బాగా అలవాటయింది. భవానీకి సినిమాల పిచ్చి ఎక్కువ. తను ఒక్కతీ వెళ్ళదు. నేను కూడా రావాలంటుంది" మోహన్ ఏది చెప్పినా ఆశ్చర్యపడే స్థితినుండి దాటిపోయింది వందిత.

అనాటి మోహన్ తన కళల్లో అరా

తించే మహోన్నతమైన వ్యక్తి. విశిష్టమైన వ్యక్తిత్వం గల ఆనాటి మోహన్ మాత్రమే తెలుసు తనకి.

మోహన్, తనూ పక్కపక్క వాటాల్లో వుండేవాళ్ళు అయినా ఒక యింట్లో వున్నట్టే వుండేవారు. ఎక్కడున్నా యిద్దరూ కల్సి వుండవలసిందే.

అప్పట్లో మోహన్ పాటలు పాడేవాడు. నందితకు పాటలంటే ఎంతో యిష్టం. మోహన్ పాడుతుంటే తనూ కూనిరాగాలు తీసేది.

తను తప్పుగా పాడుతుంటే మోహన్ సరిదిద్దేవాడు.

"నువ్వెక్కడయినా నేర్చుకున్నావా మోహన్" అనడిగితే

"లేదు నందితా. రేడియోలో వస్తుంటే జాగ్రత్తగా వింటాను" మోహన్ త్యాగరాజ కీర్తనలు పాడుతుంటే అపర త్యాగరాజులా దర్శన మిచ్చేవాడు.

మొదటి పరిచయం ఎలా అయిందో గుర్తు లేదు గానీ తరవాత్తరవాత ఒకరి నొకరు విడవలేక అంటిపెట్టుకు తిరిగిన రోజులు మాత్రం ఇప్పటికీ గుర్తున్నాయి. అమ్మా, నాన్నగారు ఎంత కేకలేసినా వినిపించుకునేదిగాదు

"పెద్దదానివయ్యావు. ఇంకా మగపిల్లాడితో చేరి ఏంవిటా తిరుగుడు" అనేది అమ్మ

అమ్మ మాటలు లక్ష్యపెట్టేది గాదు తను. మోహన్ ఎంత పెద్దవాడయినా తన కంటికి చిన్నగానే వుండేవాడు.

అన్నం తిని చెయ్యి కడుక్కోని ఎక్కడో వున్న తనని వెతుక్కుంటూ వచ్చి తన కొంగుకి చెయ్యి తుడుచుకోవటం తను మర్చిపోగలదా...

తన కిష్టమని చింతకాయల కోసం చింతచెట్టెక్కి కింద పడి తనకోసం దెబ్బలు తగిలించుకోవటం తను మర్చిపోగలదా? ఏది మర్చిపోయింది తను?

ఇవన్నీ చాలా సాధారణమైన చిన్న సంఘటనలే కావచ్చును. కానీ ఇలాంటి చిన్న విషయాలే మనసుకు హత్తుకుపోయి జీవితాంతం వదలవు.

అప్పట్లో తన వయసు పదిహేడు సంవత్సరాలు. మోహన్‌కి మహావుంటే పదిహేనేళ్ళు వుండొచ్చు.

మోహన్‌కి జ్వరం వస్తే రెండు రోజులు కంటికిరెప్పలా కాపాడి దగ్గరుండి పథ్యం తినిపిస్తుంటే అమ్మ ఏమంది?

"ఏవిటి వాడంటే నీకంత శ్రద్ధ? నలుగురూ నాలుగువిధాలుగా అనుకుంటారని జ్ఞానమైనా వుండొద్దూ?"

మోహన్‌కి తనకీ వున్న బాంధవ్యం ఏమిటి?

అక్కా, తమ్ముడూనా...

లేక స్నేహితులా?

అదీగాక అమ్మ అపోహ పడ్డట్టుగా ప్రేమ సంబంధమేదైనానా?

తన మనసుని తనే తెరిచి చూసు

తుంది.

అప్పుడు తెలిసింది ఒక నగ్నసత్యం-

మోహన్‌కి తనకీ వున్నది అక్కాతమ్ముడు, ఇద్దరు స్నేహితుల మధ్య వుండే సన్నిహితత్వం, ఇద్దరు ప్రేమికుల మధ్య వుండే అనురాగం...ఇవేమీ కాదు!

వీటన్నిటికీ అతీతమైన, ఊహాతీతమైన మానసిక బంధం— ఒకరికి చెప్పేందుకు భాషలేని బంధం అది.

మోహన్ అంతా మర్చిపోయాడా?

మనిద్దరి మధ్యా వున్న పదిహేనేళ్ళ ఆత్మీయత అంత తేలిగ్గా మర్చిపోగలిగావా? నందిత మనసులోనే రోధించింది.

మర్నాడు మోహన్ ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

"ఇంకా వుంటావా నాల్గురోజులు నందితా?" అద్దంముందు నిలబడి తల దువ్వుకుంటూ అడిగాడు.

"సాయంత్రం బండికి వెళుతున్నాను మోహన్..." అంది ముక్తసరిగా.

"అదేం నాలుగురోజులు వుంటావనుకున్నాను. ఏవిటో అసలు వున్నట్టే లేదు. అవున్లే. అవతల పిల్లల్ని వదిలి వచ్చినట్టున్నావు... పెద్దమ్మాయికి పెళ్ళిచేసే వుద్దేశం వుందా?"

అతనికి జవాబు చెప్పాలనిపించలేదు అక్కణ్ణించి మోహన్‌కి కనపడకుండా దూరంగా పారిపోవాలనిపించిందో క్షణం.

సాయంత్రం భవానీ బజారుకి వెళ్ళింది అప్పుడే ఆఫీసు నుంచి వచ్చిన మోహన్ నందిత అందించిన టీ తాగాడు. కాసేపు పేపరు తిరగేశాడు.

అక్కడే కుర్చీలో కూర్చున్న నందిత కాలక్షేపానికి పత్రిక తిరగేయసాగింది.

పూర్వం కలుసుకుంటే చాలా గంటలు గంటలు కబుర్లతో దొర్లిపోయే కాలం ఇప్పుడిలా నిమిషం ఒక యుగంగా గడుస్తోంది.

ఏవిటిది? మోహన్‌తో మాట్లాడటానికి తనకి మాటలే కరువయ్యాయా? అతనిలో తెలియని మార్పు తనని భయపెడుతోంది. అర్థంగాని ఫీలింగ్ తనని మూగదాన్ని చేస్తోంది.

బహుశ మోహన్ ఇదేమీ ఆలోచించడేమో! అతను చాలా మామూలుగా వున్నాడు.

చిన్ననాటి ప్రియస్నేహితురాలు తన మనసులో మనసుగా, ప్రాణంలో ప్రాణంగా నిలిచిన ఆనాటి ప్రియనేస్తం కనిపించిన ఆనందం, గాఢమైన ఆ అనుభూతి అతనిలో కనిపించదేం?

ఆ రోజులు, ఆ సంఘటనలు అన్నీ మర్చిపోయాడా? లేక మర్చిపోయినట్టు నటిస్తున్నాడా?

ఆనాటి పాటలూ ఆ కబుర్లూ అన్నీ ఏమయిపోయాయి?

'నువ్వు రేడియోలో పాడు మోహన్



వీలు తప్పకుండా పైకివచ్చే ఛాన్సు వుంది."

"ఏ కోపమైనా కైత్రి చేస్తాను వందితా, నాలో అంతర్గతంగా వున్న కోరిక కూడా అదే! నా మనసులో మాట నువ్వు బైటికి చెప్పావు అంతే! మనిద్దరి మనసులో వున్నదీ ఒకటే విషయం

చూశావా?" అన్నాడు నవ్వుతూ

"నువ్వు చాలా గొప్పవాడివి కావాలి మోహన్. అందరిలా మామూలు జీవితం గడపవద్దు. నిన్ను ఉత్సాహ పరచటానికి నేనున్నాను ఎట్టి పరిస్థితి లోనూ పాడటం మానవద్దు" అంది తను ఆవేశంగా.

మోహన్ తనవంక నవ్వుతూ చూశాడు.

'ఒక్కొక్కసారి మనిద్దరి మధ్య వున్న ఈ సంబంధానికి అర్థమేమిటా అనిపిస్తుంది నాకు వందితా. దీనికేం పేరు పెట్టాలంటావు?' అనేవాడు.

ఆ మోహనేనా ఈనాడిలా అల్పుడిలా మాట్లాడుతున్నాడు. అతనిలో కళాతృష్ణ ఏమైపోయింది? పదేళ్ళ జీవితం మనిషిలో ఇంత మార్పుని తీసుకురాగలదా!

"ఏమిటి ఆలోచిస్తున్నావు వందితా, నా సంగతి సరే. నీ మాట చెప్పు. మీ వారెలా వుంటారు? నన్ను గురించి ఎప్పుడయినా చెప్పావా? ఆయనేమి

అపార్థం చేసుకోలేదు గదా?"

మొదటిసారి చాలా అసహ్యంగా చూసింది వందిత అతని వేపు.

"వందితా అడుగుదామనుకుంటూనే మర్చిపోయాను. నా భార్య ఎలా వుంది? తనకి చీర నచ్చిందా? చాలా యిష్టపడి చేసుకున్నాను."

"చాలా నచ్చింది. ఆమెకేం?" అంది పొడిపొడిగా.

మోహన్ ఎలా చెప్పను? నా బాధ నీతో ఏమని చెప్పుకోను? నీ భార్య కాదగిన వ్యక్తి చాలా గొప్ప భావాలు కలిగివుండాలని, నీ అభిరుచులకి తగ్గట్టుగా వుండాలనీ కోరుకున్నానుగానీ... నిన్నింత జీవన్మృతుడిని చేసే మనిషిని నీ పక్కన వూహించుకోలేదు మోహన్

మళ్ళీ అవే స్మృతులు...

గత జ్ఞాపకాల నీడలు...

ప్రతి ఒక్క సంఘటనా గతంతో పోల్చిచూసుకుని మనసులోనే ఆక్రోశిస్తోంది వందిత.

ఆమె మనసులో చెలరేగుతున్న యుద్ధాన్ని ఏమాత్రం పసిగట్టలేని మోహన్ తన మామూలు ధోరణిలో తన ఆర్థిక పరిస్థితి, అప్పులు... భార్య పట్ల తనకిగల ప్రేమ...

'మోహన్ మనమధ్య జరిగే సంభాషణ ఇంత పేలవంగా వుంటుందా? ఒంటరిగా కలిస్తే మనం మాట్లాడుకునే మాటలు ఇవేనా? చాలు మోహన్... కలల ప్రపంచం నుండి నన్ను వాస్తవానికి దిగనీ... అప్పుడు నీ బాధ వింటాను. నిన్ను కలవకుండా అసలు చూడకుండా వుంటే నా వూహా ప్రపంచంలో అతి గొప్ప వ్యక్తిగా జీవితాంతం నిలిచి వుండేవాడివి. నాదే పొరపాటు మోహన్ రాయిని రత్నంగా భ్రమించాను. మకిలి పట్టిన వస్త్రాన్ని సానబెట్టి ధగధగలాడేలా చెయ్యాలనుకున్నాను. అసలది వజ్రమే కాదని చాలా ఆలస్యంగా తెలిసింది మోహన్. నువ్వు మామూలు మనిషివి... అతి సామాన్యుడివి నిన్ను గురించి గొప్పగా అంచనా వెయ్యటం నాదే పొరపాటు...గ్రహించాను... నా తెలివితక్కువ ఇప్పటికి గ్రహించాను. నువ్వు అశక్తుడివి. నువ్వేం చెయ్యలేవు. నీ జీవితం, నీ వ్యక్తిత్వం నీ అధీనంలో లేనప్పుడు. నా జీవితంలో ఈ వెల్తి పూడ్చుకోవటానికి కొంచెం టైమివ్వు మోహన్... ఆ తర్వాత నీతో రాజీ పడ్తాను...'

తను రాత్రి కూచుని రాసిన ఉత్తరాన్ని భద్రంగా మోహన్ టేబిల్ మీద వుంచింది.

మనసులో తగిలిన గాయాన్ని అతి నిశ్శబ్దంగా భరించి మౌనంగా రైలెక్కింది వందిత.

* * *